ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 18.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
బుధవారం 27 నవంబరు 2024

ట్రెక్కింగ్‌కు కేరాఫ్ భువనగిరి ఖిల్లా

- ప్రపంచ పర్వతారోహకులకు ఇక్కడి నుంచే ప్రాథమిక శిక్షణ
- ఇప్పటి వరకు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వారు 98 మంది
- ప్రపంచ ఎత్తైన పర్వతాలను అధిరోహించిన వారు మరో 800 మంది

7





వసతి గృహాల్లో.. గజగజ

● కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు ● చల్లని నీటితోనే స్నానం...విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు కరువు ● సంక్షేమ హాస్టళ్లపై 'ఆంధ్రజ్యోతి' విజిట్

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. సంక్షేమ, గురుకుల వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో అమలు కావడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలావరకు వార్డెన్లు లేకపోవడంతో ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. వీరు కూడా స్థానికంగా ఉండటంలేదని ఫిర్యాదులు అందుతున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' సంక్షేమ హాస్టళ్ల పరిస్థితిపై విజిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించింది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లతోపాటు కేజీబీవీ, గురుకులాలు మొత్తం 91వరకు ఉన్నాయి. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మొత్తం 19వరకు ఉండగా, బాలురు 11 హాస్టళ్లల్లో 473 మంది, బాలికలు ఎనిమిది హాస్టళ్లల్లో 501 మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో జిల్లాలో మొత్తం బాలురు, బాలికల హాస్టళ్లు ఎనిమిది ఉండగా, 683 మంది విద్యార్థులున్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 15 బాలురు, బాలికల వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో 10 బాలురు హాస్టళ్లల్లో 393 మంది విద్యార్థులు, ఐదు బాలికల హాస్టళ్లలో 231 మంది విద్యార్థులుంటున్నారు. అయితే హాస్టళ్లలో నమోదైన విద్యార్థులంతా కూడా ఉండటంలేదు. జిల్లాలో వాతావరణం మారిపోవడంతో చలి తీవ్రంగా పెరిగింది. జిల్లాలో కనిష్ఠంగా 14 నుంచి 19 డిగ్రీలకు చేరుకుంటుంది. అయితే సంక్షేమ హాస్టళ్లల్లో ఉండే విద్యార్థులు చలికి తట్టుకుని నిద్రపోవడమే సమస్య కాగా, ఉదయాన్నే లేవగానే చల్లని నీటితో స్నానం చేయడం ఇబ్బందిగా మారింది. జిల్లావ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లల్లోనూ చల్లని నీటితోనే విద్యార్థులు స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. చాలావరకు వసతిగృహాల్లోనూ కిటికీలు, తలుపులు మరమ్మతులు చేయాల్సి ఉంది. దుప్పట్లు, రగ్గులు, చద్దర్లు పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులు చలికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. హాస్టళ్లల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు, పరిశుభ్రత గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తుంది. హాస్టళ్లల్లోని గదుల్లో కిటికీలు సరిగ్గా లేకపోవడంతో చల్లని గాలికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అద్దె ఇళ్లలోని హాస్టళ్లకు ప్రహరీ లేకపోవడంతో పాములు తరుచుగా వస్తున్నాయి. దీంతో విద్యార్థులు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఒక్కో వార్డెన్ రెండు నుంచి మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. చాలా మంది వార్డెన్లు స్థానికంగా ఉండటంలేదన్న ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని సంక్షేమ హాస్టళ్లలో రాత్రి వండిన వంట పాత్రలను కూడా కడగడంలేదని, సరైన సమయానికి వార్డెన్, సిబ్బంది కూడా అందుబాటులో ఉండటంలేదన్న విమర్శలున్నాయి.



ఆత్మకూరు(ఎం)లో బీసీ హాస్టల్‌లో శుభ్రం చేయని వంటపాత్రలు

సౌకర్యాలు అంతంతే..

విద్యార్థులకు నాలుగు జతల దుస్తులు, కార్పెట్‌లు, బెడ్‌షీట్లు, ఉలెన్ బ్లాంకెట్స్, స్కూల్ బ్యాగ్‌లు, పిల్లోస్, నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ ఏడాది చాలావరకు సంక్షేమ హాస్టళ్లకు అందలేదు. హాస్టళ్లలోని మరుగుదొడ్లు, స్నానాల గదులు విద్యార్థులకు సరిపడ లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం టిఫిన్, పాలు, గుడ్లు ఇస్తున్నారు. భోజనం నాణ్యతగా ఉండటంలేదని విద్యార్థులు వాపోతున్నారు. పలుచోట్ల హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడి మీదపడతాయన్న భయంతో విద్యార్థులు భయపడుతున్నారు. విద్యార్థులకు వేడి నీరు అందించాలని ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు మూలనపడ్డాయి. పలు హాస్టళ్లకు కోతుల బెడదకూడా ఉంది.

జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి ఇలా..

- రామన్నపేటలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులు లేకపోవడంతో మూతపడింది. ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దుప్పట్లు పంపిణీచేశారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. నైట్‌వాచ్‌మెన్‌లు లేకపోవడంతో వంట మనుషులతో కాలం వెళ్లదీస్తున్నారు. మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లే ఉన్నారు.
- మోటకొండూరులోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 640 మందికి 579మంది ఉన్నారు. అద్దెభవనంలో కొనసాగుతోంది. విద్యార్థులు చల్లని నీళ్లతో స్నానం చేస్తున్నారు. విద్యార్థులకు ఇప్పటివరకు దుప్పట్లను పంపిణీ చేయలేదు. ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రహరీ లేకపోవడంవతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు.
- భువనగిరి పట్టణంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లల్లో దుప్పట్లు, కార్పెట్స్ బ్లాంకెట్స్, దోమల నివారణకు ఆల్‌అవుట్, దూప్ స్టిక్‌ల పంపిణీ పూర్తయింది. ఎస్సీ హాస్టల్‌లో మాత్రం ఇప్పటివరకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చల్లని చలిలోనూ వేడినీళ్లు ఇవ్వడంలేదు. పలు హాస్టళ్లకు రెగ్యూలర్ వార్డెన్లు లేకపోవడంతో ఇన్‌చార్జీలతోనే కాలం

	హాస్టళ్ల సంఖ్య	బాలికలు	బాలురు
ఎస్సీ	19	501	473
ఎస్టీ	8	683	
బీసీ	15	231	393

(మిగతా 8వ పేజీలో..)



ఐదేళ్లుగా నిరీక్షణే

● పరిహారంకోసం ఎదురు చూస్తున్న చోక్లతండ, కొక్యాతండ గిరిజనులు ఇళ్లు, వాకిలి, పొలాలు అన్నీ కోల్పోయారు. బతుకుదెరువు కూడా భారమైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. తమకు పరిహారం ఇప్పించాలని ఐదేళ్లుగా నిరీక్షిస్తూనే ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 11.39 టీఎంసీల సామర్థ్యంతో బస్వాపూర్ రిజర్వాయర్‌ను నిర్మిస్తోంది. ఈ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కోసం నిర్మించే ఆనకట్ట నిర్మాణానికి ప్రభుత్వం రుస్తాపూర్, తిమ్మాపూర్, చోక్లతండ, కొక్యాతండ, పీర్యాతండ గ్రామాలకు చెందిన భూములను గతంలోనే సేకరించింది. ప్రభుత్వం 270 ఎకరాల భూమిని సేకరిస్తుండడంతో పీర్యాతండ తప్పా చోక్లతండ, కొక్యతండ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికానుండడంతో 10 నెలల క్రితం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తండాలను సందర్శించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించేందుకుగాను గ్రామాల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ప్రభుత్వ భవనాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, 18 సంవత్సరాలు నిండిన వారు ఎంత మంది ఉన్నారు అనే దానిపై రెండు రోజులు సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. కాగా 270 ఎకరాలకు 2020 ఫిబ్రవరిలో భూ సేకరణ కోసం 29 ఎకరాలకే నోటిఫికేషన్ జారీచేసి సేద్యం చేస్తున్న 20 ఎకరాల భూమికి మాత్రమే ఎకరాకు రూ.15.05లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. మిగతా తొమ్మిది ఎకరాల్లో డీటీసీపీ లేవుట్ ఉన్నందున పరిహారం ఇవ్వలేదు. ఈ లేవుట్‌లో కొందరు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తుందని కొందరు పరిహారం తీసుకోలేదు. 2022 అక్టోబరు 2న 241 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం రెండోసారి నోటిఫికేషన్ జారీచేసింది. ఆ భూమికి పరిహారం ఇచ్చేందుకు 2023 జూలై 30న రూ.48.41కోట్లు కేటాయించినట్లు అధికారులు తమకు చెప్పినట్లు భూ నిర్వాసితులు వివరించారు. అక్టోబరు 9, 2023న అవార్డు ప్రకటిస్తున్నామని తండావాసులు, భూ నిర్వాసితులకు నోటీసులు పంపారు. దీంతో తండావాసులంతా.. (మిగతా 8వ పేజీలో)

ధాన్యం కొనుగోళ్లలో

ఇబ్బందుల్లేకుండా చూడాలి

● కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి ఉత్తమ్, హాజరైన కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి న్యూఢిల్లీ నుంచి మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, గన్నీ సంచులు ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచుకొని ధాన్యం ఆన్‌లైన్‌లో నమోదు తర్వాత వెంటనే రైతుల ఖాతాలో డబ్బు జమయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులు, ప్రజలకు చేరేవిధంగా విరివిగా ప్రచారం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ శాంతికుమారి, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌లు పాల్గొనగా, కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అలసత్వం వహించకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో వేగంపెంచి నవంబరు 30న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుల పండగను విజయవంతం చేయాలన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

● మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

భువనగిరి గంజ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను కాపాడుకుందామని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి, దీక్షా దివస్ కార్యక్రమ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగానికి సిద్ధమైన కేసీఆర్ స్ఫూర్తితో, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాశనమవుతున్న తెలంగాణను కాపాడుకునేందుకు కార్యకర్తలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. 2009 నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన అమరణ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. సాధించుకున్న తెలంగాణలో గత పదేళ్లుగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ, కార్యక్రమాలు చేపట్టగా... కల్లబొల్లి మాటలతో అధికారులంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ప్రజా ఉద్యమాలు చేపట్టాలన్నారు. జిల్లాకేంద్రంలో ఈ నెల 29న చేపట్టాల్సిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో త్యాగాల కోర్చి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, గాదె నరేందర్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన అంజనేయులు, శంకరయ్య, నాయకలు ఏవీ కిరణ్‌కుమార్, సుధాకర్ గౌడ్, జనగాం పాండు, సిద్దుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ సొంత భవనాలు

● ఏడాది పాలనలో ఎన్నో పథకాలు అమలు చేశాం ● రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది ● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీకేంద్రాలకు సొంత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మాసాయిపేట గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో అద్దె భవనంలో అంగన్‌వాడీకేంద్రాలు పనిచేస్తున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. యాసంగి పంట సాగుకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోలు విషయంలో జిల్లాస్థాయి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తం చేస్తున్నామని, ఏమైనా ఇబ్బందులుంటే తమకు సమాచారమివ్వాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. మాసాయిపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా మాసాయిపేట గ్రామపంచాయతీ కార్మికులను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ చైర్మన్ చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

రాజాపేట: ప్రజ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాజాపేట మండలం రాఘునాథ్‌పూర్‌లో మంగళవారం అంగన్‌వాడీ భవన నిర్మణ పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామపంచాయతీ కార్మికులకు, ఉపాధిహామీ పథకంలో 100రోజులు పూర్తి చేసుకున్న వృద్ధులను సన్మానించి మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన దేశానికే ఆదర్శమన్నారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, డెరెక్టర్లు చిలువేరు బాలరాజు, విట్టల్, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కిషన్, నాయకులు శ్రవణ్, పెంటయ్య, మహేందర్‌గౌడ్, రామ్‌జీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

తుర్కపల్లి: మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని ఇందిరానగర్‌లో నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పేదలకు నాణ్యమైన విద్య వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంతకుముందు తుర్కపల్లి మండలం పెద్దతండ గ్రామంలో వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ చైర్‌పర్సన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ధానావతు శంకర్ నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి, మాజీ సర్పంచ్ యెలుగల వెంకన్న, బొత్త రాములు, భూక్య రాజారాం నాయక్, రామగోని వెంకటేశ్‌గౌడ్ తదిరులు పాల్గొన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న వీరారెడ్డి

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని టేకులసోమారం గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్ర వాతావరణంలో వంట తయారు చేయాలన్నారు. మంచినీటితోనే భోజనాన్ని వండాలని ఆదేశించారు. అనంతరం రెడ్లరేపాక గ్రామపరిధిలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకోసం సర్వే నెం.580ని పరిశీలించారు. ఆయనవెంట చౌటుప్పల్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ మనోహర్ తదితరులున్నారు.

హక్కులను కాపాడటమే లక్ష్యం

● రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్ హనుమంతరావు



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించి, ప్రజల హక్కులను కాపాడటమే భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యమని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో అందరి బాధ్యత కీలకమన్నారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, కలెక్టరేట్ ఏవో జగన్‌మోహన ప్రసాద్, చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి కలీమ్, భూగర్భ జలవనరుల శాఖాధికారి జ్యోతికుమార్, పరిశ్రమల శాఖ జీఎం రవీందర్, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి మనోహర్, సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు ట్యాంపరింగ్ కావు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ట్యాంపరింగ్ కావని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ధృవీకరించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పునర్ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు.

రక్షణ నుంచి వైద్యరంగంలోకి

● రెమ్యోలియన్ విద్యార్థి అవినాష్‌కు ఎంబీబీఎస్‌లో సీటు ● ఆయన స్వస్థలం గుర్రంపోడు మండలం నడికుడ

రక్షణ రంగంలో చదువుతున్న వారు వైద్యరంగంలోకి చాలా తక్కువ. అందులోనూ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల(ఆర్‌ఐఎంసీ) విద్యార్థులు రావడం మరీ అరుదు. అలాంటి అరుదైన ఘనతకు నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం నడికూడ గ్రామానికి చెందిన చేపూరి అవినాష్ సాధించారు. రక్షణ రంగంలో ఏ-గ్రేడ్ ఉద్యోగంలో చేరే అవకాశం ఉన్నా వదులుకుని నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించారు. అంతకుముందు రాష్ట్రం నుంచి 2017లో ఆర్‌ఐఎంసీకి ఎంపికైన ఏకైక విద్యార్థి కూడా ఆయనే.

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)



డీజీపీ కార్యాలయంలో సీపీఆర్‌వోగా పనిచేస్తున్న నడికూడ గ్రామానికి చెందిన సీహెచ్.శ్రీనివాసరావు పెద్దకుమారుడు చేపూరి అవినాష్ రెండో తరగతి వరకు నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో, 8వ తరగతి వరకు హైదరాబాద్‌లోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో చదివారు. అనంతరం 13ఏళ్ల వయస్సులో 2017లో రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాలకు నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించి ఆ కళాశాలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్ష ద్వారా తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ రాత పరీక్షను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తారు. ప్రతీ రాష్ట్రం నుంచి ఒక్కొక్క విద్యార్థిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆర్‌ఐఎంసీ కళాశాలలో ప్రవేశం కల్పిస్తారు. ఇక్కడ 8 నుంచి 12వ తరగతి వరకు విద్యాభ్యాసంతో పాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాలను ఎంచుకునేందుకు వీలు కల్పిస్తారు. ఇక్కడ చదివిన విద్యార్థులను రెమ్యోలియన్స్‌గా పిలుస్తారు. కానీ అవినాష్ మాత్రం అక్కడి నుంచి బయటికి వచ్చి మెడిసిన్‌ను ఎంచుకుని నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించారు. రెమ్యోలియన్ విద్యార్థి మెడిసిన్ సీటు సాధించడం చాలా అరుదు.

ఆర్‌ఐఎంసీ నేపథ్యం

1922లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ప్రారంభించిన ఈ కళాశాల, స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్‌ఐఎంసీ)గా పేరు మార్చారు. ఆర్‌ఐఎంసీ అనేక ప్రతిష్ఠాత్మక రక్షణ సిబ్బందిని అందించడంలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఈ కళాశాలలో శిక్షణ ఇస్తుంది. ఈ కళాశాల నుంచి నలుగురు భారత సైన్యాధిపతులు, ఇద్దరు భారత వైమానిక దళాధిపతులు, ఇద్దరు పాకిస్తాన్ వైమానిక దళాధిపతులు, ఒక పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, బంగ్లాదేశ్‌లో ఉన్నత స్థాయి రక్షణాధికారులు(స్వాతంత్ర్యానికి పూర్వం ఇక్కడ చదివారు) ఈ కళాశాలలో చదివిన వారిలో ఉన్నారు.ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందిన ఏకైక విద్యాసంస్థగా ఆర్‌ఐఎంసీకి గుర్తింపు ఉంది. ఈ కళాశాల దేశానికి అనేక ఆర్మీ అధికారులు,పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషన్ అవార్డు గ్రహీతలను అందించింది. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ కూడా ఈ కళాశాల విద్యార్థి.

సాంప్రదాయాలకు భిన్నంగా

సాంప్రదాయ రీత్యా రక్షణ రంగంలో సాహసాలు చేసే ఆర్‌ఐఎంసీ విద్యార్థులు రక్షణశాఖతో పాటు వారికి నచ్చిన భిన్నమార్గాలను ఎంచుకుంటారు. ఉత్తమ భారతీయ పౌరుడిగా ఆర్‌ఐఎంసీ క్యాడెట్లను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ మిలిటరీ కళాశాల శిక్షణ ఇస్తుంది. ఈ విధంగానే అవినాష్ వైద్యరంగాన్ని ఎంచుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశించారు. ఆర్‌ఐఎంసీ విద్యను పూర్తి చేసిన తర్వాత 2024లో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో రెమ్యోలియన్‌గా ఎంబీబీఎస్ సీటు పొందారు.

విజయాలు

ఆర్‌ఐఎంసీలో అవినాశ్ చదువుతో పాటు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో తర్ఫీదు పొందారు. 2017లో ఉత్తరాఖండ్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలవడం నుంచి, 2023లో తెలంగాణ చీఫ్ మినిస్టర్ కప్‌లో సిల్వర్ మెడల్ అందుకోవడం వరకు అవినాష్ అనేక పతకాలను గెలుచుకున్నారు. కాగా సైనిక విద్యాసంస్థల విద్యార్థుల అత్యున్నత ప్రమాణాలకు చిహ్నంగా ఇచ్చే మెరిట్ కార్డ్, హాఫ్-బ్లూ పురస్కారాలను 2019లో అందుకున్నారు.

జాతీయ స్థాయిలో ప్రాధాన్యం

అవినాష్ 2021 నార్త్‌జోన్ ఎయిర్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్, యూత్ కేటగిరిల్లో నేషనల్ ఛాంపియన్‌షిప్‌కి అర్హత సాధించడమే కాకుండా 2022, 2023లో 65వ, 66వ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించి నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో రినౌన్డ్ షాట్‌గా అర్హత సంపాదించారు.

వైద్యరంగంపై ఆసక్తితోనే చేరా


తండ్రి శ్రీనివాసరావుతో అవినాష్

డెహ్రాడూన్‌లోని ఆర్‌ఐఎంసీలో చేరిన తర్వాత రక్షణశాఖలో కొనసాగాలంటే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఏ-గ్రూప్ ఉద్యోగంలో చేరేవాడిని. ఆ ఉద్యోగ అవకాశాన్ని వదులుకుని వైద్యరంగంపై ఉన్న ఆసక్తితో నీట్ పరీక్ష రాసి ప్రభుత్వ కళాశాలలో సీటు పొందాను. అది అదృష్టంగా భావిస్తున్నా. ఆర్‌ఐఎంసీలో చదివిన క్యాడెట్ ఎవరూ ఈ మధ్యకాలంలో ఎంబీబీఎస్‌లో చేరే అవకాశం రాలేదు. నాకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవకు పాటుపడతా.

చేపూరి అవినాష్, రెమ్యోలియన్

పాఠాలు.. పాటలు

లఘు చిత్రాలతో సామాజిక చైతన్యం కల్పిస్తున్న లింగారెడ్డి

రాష్ట్రంలో జరుపుకునే ప్రముఖ పండుగలు, ఉత్సవాలు, జానపద సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, విద్య అంశాలను ఇతివృత్తంగా తీసుకొని లఘు చిత్రాలు, పాటలు నిర్మించి అందరి ఆదరణ పొందుతున్నాడు పెసరు లింగారెడ్డి. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ ఆయన తీసే ప్రతీ లఘు చిత్రం లేదా పాట ఒక సామాజిక అంశాన్ని స్పృశిస్తూ, సందేశాత్మకం గా ఉంటుంది.

- (తుర్కపల్లి -ఆంధ్రజ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెసరు లింగా రెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా పాఠశాల విద్యా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారిగా, జిల్లా భవిత కేంద్రాల సమన్వయకర్తగా విధులు నిర్వహిస్తూ స్వయంగా రాసి పాడు తూ నటిస్తుంటాడు. ఆ వీడియో లు, షార్ట్స్, సందేశాలను ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్‌ల్లో పెడుతూ అందరి మన్నన లు పొందుతున్నారు. తొలుత విలేజ్ సినిమా బ్యానర్‌పై పల్లె పంచాయతీ, తాగుబోతు శ్రీను, ప్రేమ-పెళ్లి, చిన్నారి పెళ్లి కూతురు, బాల్య స్నేహితులు, ఏటీఎం మోసాలు, సర్కారు బడి-సల్లని ఒడిలాంటి లఘు చిత్రాల్లో నటి ంచి మెప్పించారు. తాను ఉపాధ్యాయుడిగా పనిచేసి న రాజాపేట మండలం చల్లూరు ఉన్నత పాఠశాలలో 2020-23 సంవత్సరాల్లో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా స్వయంగా సత్యహరిశ్చంద్ర ఏకపాత్రాభినయం, గొల్ల మల్లయ్య పాత్రలో నటించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

పదుల సంఖ్యలో లఘు చిత్రాలు

యూట్యూబ్‌లోమనం ఛానల్ ద్వారా రెండేండ్లుగా పదుల సంఖ్యలో లఘు చిత్రాలు తీశారు. అంతే కాకుండా లింగారెడ్డి తాను సందర్శించిన కొత్త ప్రదేశాలు ప్రత్యేక ఆకర్షణలు చిత్రీకరించి తన ఛానల్‌లో అందుబాటులో ఉంచుతారు. తిండిబోతు మొగుడు, విలేజ్ శ్రీను 31 ఫస్ట్ దావత్, బావా బాటిల్ కల్లు తెస్తావా, తుంటరి దొంగలు, నీముఖం చూస్తే అంతే, ప్రేమకు హద్దుండాలి లాంటి లఘు చిత్రాలను తీశారు.

పాటల రచయితగా

జైదపురం అంగట్లో జంగయ్య పనీ పాట లేదా పిల్లగా, వాడవాడలా జూడు.. పూల సింగిడి జూడు(బతుకమ్మపాటలు), జగమేలే తల్లికి జే గంటలు (బోనాల పాట), ఇదే ఇదే బృందా వనం(పాఠ శాల ప్రాముఖ్యత పాట) ఇలా అనేక పాటలు లింగారెడ్డికి పాటల రచయితగా గుర్తింపు తెచ్చాయి. ఈ ఏడాది అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర అనే ప్రబంధం నుంచి తీసుకున్న వరూధిని ప్రవరాఖ్యుల ప్రణయ సన్నివేశాన్ని దృశ్య కావ్యరూపంలో వరూధిని విరహం పేరుతో మనం ఛానల్ ద్వార యూట్యూబ్‌లో విడుదల చేశాడు.

మంచి స్పందన లభిస్తోంది



తెలుగు పాటలలోఅర్థం, పర్థం లేని పదాలతో డీజే మిక్సింగ్‌లతో యువతను ఆకట్టుకునే పాటలు వస్తున్న తరుణంలో ఒక ప్రబంధ నేపథ్యాన్ని చేసుకొని రాసిన వరూధిని విరహం అనే పాటను అందరూ ఆదరించడం చాలా ఆనందంగా ఉంది. ప్రముఖ అర్షకవి, ఆచార్య మసన చెన్నప్ప, సాహితీ విమర్శకులు దాస్యం సేనాధిపతి, సినీ గేయ రచయితలు మౌనశ్రీ మల్లిక్, అభినయ శ్రీనివాస్ లాంటి అనేక మంది పెద్దలు కూడ సాహిత్యాన్ని, దృశ్య కావ్య చిత్రీకరణను చూసి సినిమా పాటలకు తీసిపోని రీతిలో ఉందని ప్రశంసించారు. ఇదిమా శ్రమకు గుర్తింపుగా భావిస్తున్నా.

- రచయిత పెసరు లింగారెడ్డి


గోదాంను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సొసైటీల అధ్యక్షులు

'హతూరు' స్ఫూర్తితో సొసైటీల బలోపేతం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ అవార్డు పొందిన హతూరు సొసైటీ అభివృద్ధిని, ఆ సొసైటీ పాలసీలను విధి విధానాలను స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 107 ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు జరిగే అధ్యయన యాత్రలో భాగంగా మంగళవారం కొడగు జిల్లాలోని హతూరు పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ ఈ సొసైటీ జాతీయ స్థాయిలో ఉత్తమ సొసైటీగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆ సొసైటీ పాలకవర్గాన్ని, చైర్మన్‌ను అభినందించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సొసైటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాశం సంపత్‌రెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, స్వరూప స్వభావాల గురించి వివరించారు. భారత రాజ్యాంగం భారతీయుల గుండె చప్పుడని, రాజ్యాంగస్ఫూర్తిని రాజ్యాంగ విలువలను పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

● భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఇలా త్రిపాఠి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. మంగళవారం రాష్ట్ర విద్యా కమిషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన విద్యా కమిషన్ రాష్ట్ర చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేష్, జోష్నారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌వో అమరేందర్, డీఈవో భిక్షపతి, ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న విద్యావేత్తలు, మేధావులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు ఈ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రాణాలైనా అర్పిస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పీఠికకు పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ ఆఫీసర్ పిచ్చయ్య, అడ్వకేట్ ఎన్నమల్ల రమేష్, జిల్లా కో చైర్మన్లు రేకల సైదులు, తెలగమల్ల యాదగిరి పాల్గొన్నారు.

● దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ఎంఈవో బాలాజీనాయక్ ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగంలోని మౌలిక అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరహరి, అయూబ్‌ఖాన్, బాబా పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగం పౌరులకు హక్కులతో పాటు బాధ్యతలు, విధులు కల్పించిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం తాలూకా కమిటీ కన్వీనర్ జిల్లా రాములు, యేకుల రాజారావు, ధర్మపురం శ్రీను, యేకుల సురేష్, గ్యార యాదగిరి, సురేష్, రాజేష్, వెంకన్న, సాలయ్య, కొండమల్లేపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో అంబేద్కర్ చిత్రపటానికి హెచ్ఎం నాగేశ్వర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లగొండ డీఈవో కార్యాలయం వద్ద రాజ్యాంగ పీఠికకు పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

● చిట్యాలలో ఆక్స్‌ఫర్డ్ విద్యాలయం విద్యార్థులు జాతీయోద్యమ నాయకుల వేషధారణలో 200 మీటర్ల భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లిలో ఎంపీడీవో కార్యాలయం, అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద అంబేద్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, నాయకులు సాలయ్య, అచ్యుత్, పవన్, ముత్తమయ్య, రామాచారి, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు దైద శ్రీనివాస్ మాట్లాడుతూ యువత డాక్టర్ అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలని అన్నారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్ భాస్కర్, రాజకుమార్ సురేష్, నాగయ్య, సురేందర్, శ్రీకాంత్, లక్ష్మణ్, అవినాష్ పాల్గొన్నారు.

● పెద్దవూర మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేజీబీవీలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో తరి రాము, ఉపాధ్యాయులు జ్యోష్న, నాగలక్ష్మి, సరిత, లావణ్య, సువర్ణ, సరిత, అనుష్క పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాలే అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నాంపల్లి, మర్రిగూడ మండలాలలోని దేవత్‌పల్లి, నాంపల్లి, మాందాపురం, మర్రిగూడ మండలంలోని శివన్నగూడ, కొట్టాల గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గుర్రంపోడు రోడ్డు నుంచి నాంపల్లి కస్తూర్బా పాఠశాల వరకు రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు శంకుస్థాపన, దేవత్‌పల్లి రోడ్డు సాగర్ హైవే రోడ్డు వరకు రూ.4.35 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. మర్రిగూడ మండలంలోని రూ. 10లక్షలతో శివన్నగూడ గ్రామంలో నూతన గ్రామ సచివాలయానికి శంకుస్థాపన, కొట్టాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిగూడ మండలంలోని శివన్నగూడంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, కమిటీ హాల్, సబ్‌సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడమే కాకుండా అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాందాసు శ్రీనివాస్, రమావత్ శ్రీనివాస్‌నాయక్, మేతరి యాదయ్య, పాశం సురేందర్ రెడ్డి, వెంకటంపేట బాలయ్య, చిట్యాల రంగారెడ్డి, యాదగిరి, నీలిమా చంద్రశేఖర్, మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

● డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని, త్వరలోనే పునరావాసం, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నిర్వాసితులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలవడంతో ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట మేతరి యాదయ్య, శ్రీనివాస్, నర్సింహ, వెంకటయ్య ఉన్నారు.


గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యేలు

చింతపల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని ధైర్యపురితండాలో రూ.10లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, హరినాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వేల్ గురుకుల పాఠశాల భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవన సముదాయం

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): నిర్మాణం పూర్తయి రెండేళ్లకుపైగా నిరుప యోగంగా ఉన్న సర్వేల్ గురుకుల పాఠశాల భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లను తయారు చేసిన పాఠశాల భవనం శిథిలా వస్థకు చేరడంతో గత ప్రభుత్వం రూ. 18.61 కోట్లు మంజూరు చేసింది. దీంతో 2017 జూలై 17న అప్పటి విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోనే పాఠశాల భవనం పూర్తి కావాల్సి ఉండగా 2022 సంవత్సరంలో పూర్తయింది. అయితే చిన్న, చిన్న సమస్యలతో నేటికీ భవనం నిర్మాణం ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురుకుల పాఠ శాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం ప్రారంభించడం లేదని విద్యార్థులు తెలిపారు. త్వరలో భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేక నిధుల నుంచి రూ. కోటి కేటాయించారు. ఈనిధులతో ఫర్నిచర్ డైనింగ్ టేబుల్ , బెడ్స్ ఇతర వాటిని సమకూర్చారు. దీంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 27న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భవన సముదాయాన్ని ప్రారంభి ంచనున్నారు. దీనికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. నూతన భవనం ప్రారంభోత్సవం అవుతుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1న ఆలేరులో కబడ్డీ జిల్లా మహిళా జట్టు ఎంపిక

ఆలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలేరులోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో డిసెంబరు 1న 71వ జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక చేపడుతున్నట్లు అసోసియేషన్ కబడ్డీ అసోసియేషన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారిణులు 70కిలోల బరువు కలిగి ఉండాలని హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జట్టు డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు వివరించారు. వివరాలకు సెల్: 9848387964, 7702626927 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పత్తి కొనుగోలు చేయాలి

ఆత్మకూరు (ఎం) మండలకేంద్రంలో రైతుల రాస్తారోకో


ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

ఆత్మకూరు(ఎం) నవంబరు 26: (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని సిద్దేశ్వర కాటన్ మిల్లు యాజమాన్యం పత్తి కొనుగోలు చేయడానికి నిరాకరించడంతో మంగళవారం రైతులు ప్రధాన రోడ్డుపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలుగ్రామాల రైతులు మాట్లా డుతూ ఉదయం పత్తి లోడ్లతో వచ్చామని కానీ మిల్లునిర్వాహకులు పత్తి కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారని చెప్పారు. అయితే సోమవారం మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో పత్తి కొనుగోలు చేయవద్దని సీసీఐ అధికారులు ఆదేశించారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రైతుల ధర్నా విషయాన్ని మిల్లు నిర్వాహకులు సీసీఐ అధికారులకు తెలియజేయడంతో కొనుగోలు చేయాలని ఆదేశించడంతో రైతులు ధర్నా విరమించారు. రైతుల ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, కొరటికల్ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య రైతుల మద్దతు తెలిపారు.

బాల బాలికలు క్రీడల్లో రాణించాలి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని బాలబాలికలు క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు క్రీడల్లో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయు లు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం

ట్రెక్కింగ్‌కు కేరాఫ్ భువనగిరి ఖిల్లా



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని భువనగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. సముద్ర మట్టానికి సుమారు 502 మీటర్లు(1506 అడుగులు) ఎత్తుతో చారిత్రక సంపదకు, పలు రాజ వంశాల పాలనకు సాక్ష్యంగా ఉన్న ఏకశిలా పర్వతం భువనగిరి ఖిల్లా ఇప్పుడు సాహస క్రీడలకు నెలవుగా ఉంది. పర్వతారోహకులకు ప్రాథమిక శిక్షణ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 98 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని, మరో 800 మంది ప్రపంచంలోని ఎత్తైన పర్వతాలు అధిరోహించిన ఘనత సాధించారు.
(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణలో శిక్షణ పొందిన ఔత్సాహికులు పలురికార్డులు సృష్టించారు. 14ఏళ్ల వయస్సులో ఎవరెస్ట్‌ను అధిరోహించిన అతిచిన్న పర్వతారోహకురాలిగా పూర్ణ రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే ఎత్తైన ఏడు పర్వతాల్లో నాలుగింటిని అధిరోహించి మరో మూడు పర్వతాల లక్ష్య సాధనలో పడమటి అన్విత ఉంది. సుమారు 50వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భువనగిరి ఖిల్లాపైనే పర్వ తారోహణలో శిక్షణ పొందడం కూడా రికార్డుగా పేర్కొంటారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఖిల్లాను సందర్శించి పర్వతారోహణలో ప్రాథమిక శిక్షణ పొందుతుంటారు. పలువురు సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులు, విదేశీ పర్వతారోహకులు ఖిల్లాను తరుచూ సందర్శిస్తుంటారు.

ఇక్కడి శిక్షణతోనే ప్రపంచ రికార్డులు సృష్టించా




భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణపై ప్రాథమిక శిక్షణ పొందిన నేను ప్రపంచ రికార్డును తిరగరాశాను. 14 సంవత్సరాల వయస్సులో ఎస్టీ హాస్టల్ విద్యార్థినిగా మరో పర్వతారోహకుడు ఆనంద్‌తో కలిసి 2014లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాను. దీంతో అతిపిన్న ఎవరెస్టర్‌గా రికార్డు నా సొంతమైంది. ఇప్పటి వరకు ఆ రికార్డు నాపేరిటే ఉన్నది.

పూర్ణ, పర్వతారోహకురాలు.

బుకింగ్ ఇలా..

తెలంగాణ పర్యాటక శాఖ, ట్రాన్సెండ్ అడ్వెంచరీస్ ఆఫ్ రాక్ క్లైంబింగ్ సంయుక్తంగా ఖిల్లాపై ట్రెక్కింగ్‌కు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఇందుకు కేటగిరీలు, ప్యాకేజీల వారిగా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఖిల్లా దిగువ భాగంలో ఉన్న రాక్ క్లైంబింగ్ కార్యాలయానికి వచ్చినా అక్కడే స్లాట్ బుక్ చేసి ట్రెక్కింగ్‌కు అనుమతి ఇస్తారు. అదనపు ఆకర్షణగా ఖిల్లా దిగువ భాగంలో రాత్రి బస చేసేందుకు ప్రత్యేక గుడారాలు అందుబాటులో ఉంటాయి. వీటిని కూడా ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ గండికోట, వరంగల్‌లో ట్రెక్కింగ్ కోసం కూడా ఇదే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. ఆసక్తిగల వారు వెబ్‌సైట్ www.gotarc.in, findyourpea-k@-gotarc.comలో పేర్లను నమోదు చేసుకోవచ్చు. సమాచారం కోసం సెల్ 9666088821, 8121555734, 9666788808లో సంప్రదించాలి.

ఇక్కడి నుంచే పర్వతారోహకులకు ప్రాథమిక శిక్షణ



శిక్షణకు మేలైన పర్వతంగా..

పర్వతారోహణకు మేలైన పర్వతంగా భువనగిరి ఖిల్లా ఉంది. ఈ ఖిల్లాపై పర్వతారోహణ శిక్షణ కోసం ఎవరెస్టర్ బీ శేఖర్‌బాబు నెలకొల్పిన భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్‌ను 2013 సెప్టెంబరులో రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి చందనాఖాన్ ప్రారంభించారు. ఆ తర్వాత ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్‌గా రూపాంతరం చెందింది. శిక్షణ పొందిన వారు ఎవరెస్టు, కిలిమంజారో, ఎల్బ్రూస్, తదితర పర్వతాలను అధిరోహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన 50వేల మంది విద్యార్థులు ఈ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. సెలవు రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు ఖిల్లాపై రాక్ క్లైంబింగ్, రాప్లింగ్ చేస్తుంటారు. అమెరికా, రష్యా, లండన్, కెనడా తదితర దేశాలకు చెందిన పలువురు పర్వతారోహకులు ప్రతి ఏడాది భువనగిరి ఖిల్లాకు వచ్చి తమ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకుంటుంటారు.

శిక్షణ ఇలా..

ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్ ఆధ్వర్యంలో ఎవరెస్టర్స్ పడమటి అన్విత, పూర్ణ, ఆనంద్, రాకేష్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతోంది. ఔత్సాహికులకు ప్రొఫెషనల్ కోర్సులు, ఇతరులకు ప్రాథమిక శిక్షణ, ఒక రోజు రాక్ క్లైంబింగ్, రాప్లింగ్ విధానంలో శిక్షణ ఇస్తారు. ప్రొఫెషనల్స్‌కు ఏడాది పాటు దఫాల వారిగా, విద్యార్థులు, ఇతరులకు ఒకటి నుంచి ఐదు రోజులు కేటగిరీల వారిగా శిక్షణ ఉంటుంది. ఎవరెస్ట్ తదితర పర్వతాలను అధిరోహించాలనుకునే ఔత్సాహికులకు ఎవరెస్టర్ శేఖర్ బాబు పర్యవేక్షణలో దేశంలోని పలు పర్వతాలపై కూడా శిక్షణ ఇస్తారు. ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్‌రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పొందిన వారికి ఇచ్చే సర్టిఫికెట్లతో కోచ్‌లుగా ఉపాధి పొందవచ్చు. ఇప్పటి వరకు పలువురికి ఉద్యోగాలు కూడా లభించాయి.

భువనగిరి ఖిల్లాను ఎక్కుతున్న అన్విత

● ట్రెక్కింగ్‌కు అత్యుత్తమం



భువనగికి ఖిల్లా ట్రెక్కింగ్‌కు అత్యుత్తమంగా ఉంటుంది. నేను పలు సార్లు భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణ చేశాను. ఇక్కడ ప్రాథమిక శిక్షణ పొందిన వారు పర్వతారోహణలో మెలకువలను తెలుసుకోవచ్చు. భువనగిరి ఖిల్లా స్వరూపం ట్రెక్కింగ్‌కు, సాహస క్రీడలకు అనువుగా ఉంటుంది.

● తరుణ్ జోషి, ఐపీఎస్ అధికారి.

● ఎవరెస్టర్స్ కేరాఫ్ భువనగిరి ఖిల్లా



భువనగిరి ఖిల్లా కేరాఫ్ ఎవరెస్టర్స్‌గా ప్రసిద్ధి. పర్వతారోహణలో ఖిల్లాపై శిక్షణ పొందిన వారిలో 98 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని, మరో 800 మంది కిలిమంజారో తదితర ఎత్తైన పర్వతాలను అధిరోహించారు. అలాగే ట్రెక్కింగ్‌ను ఇష్టపడే ఔత్సాహికులకు కూడా భువనగికి ఖిల్లాకు ప్రాధాన్యమిస్తూ నిత్యం సందర్శిస్తున్నారు.

బీ శేఖర్‌బాబు, ఎవరెస్టర్, ఎండీ, ట్రాన్సెండ్ అడ్వెంచర్స్

నన్ను ప్రపంచానికి పరిచయం చేసిన ఖిల్లా



నేను డిగ్రీ చదువుకునే వరకు ఓ సాధారణ విద్యార్థినిని. కానీ విద్యార్థి దశలోనే భువనగిరి ఖిల్లాపై సాగుతున్న శిక్షణతో ఆసక్తి పెంచుకొని ఎంబీఏలో చేరాక పూర్తిస్థాయి పర్వతారోహణ శిక్షణను భువనగిరి ఖిల్లాపై పూర్తి చేసి ఎవరెస్ట్ సహా ప్రపంచంలోని మరో 3 ఎత్తైన పర్వతాలను అధిరోహించడంతో నేను ప్రపంచానికి పరిచయమయ్యా.

● పడమటి అన్విత, ఎవరెస్టర్.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.129	208	236
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.80
టీఎంసీలు	304.4680
ఎడమకాల్వకు నీటి విడుదల	3431
కుడికాల్వకు	10.000
విద్యుత్ కేంద్రం ద్వారా	20.787
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35.315
అవుట్‌ఫ్లో	36.918క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	330 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2వేల క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.41 అడుగులు
టీఎంసీలు	4.41
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	388.46 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	98.10 క్యూసెక్కులు

వారసత్వ సంపదను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న నాగలక్ష్మి

భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వారసత్వ, చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తుశాఖ ఉప సంచాలకులు నాగలక్ష్మి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన ప్రపంచ వారసత్వ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశ సాంస్కృతిక వైభవాన్ని వారసత్వ, చారిత్రక కట్టడాలు, ప్రదేశాల ద్వారా భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ఇందుకు పురావస్తు శాఖ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలన్నారు. భువనగిరి ఖిల్లాతో తెలంగాణకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగవర్ధన్ రెడ్డి, పర్వతారోహకురాలు పడమటి అన్విత, హెరిటేజ్ కమిటీ సభ్యులు సద్ది వెంకటరెడ్డి, జంపాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణం



సౌమ్య మృతదేహం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ వీరశేఖర్, తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్)కు చెందిన మునగాల రాంబాబు, రేణుక రెండో కూతురు సౌమ్య(13) మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ వద్దగల బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. అనారోగ్యంతో ఉండడంతో ఐదు రోజుల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం తండ్రి రాంబాబు మిర్యాలగూడ మండలం అవంతీపురం వద్ద సంతకు, తల్లి రేణుక పశువులను మేపడానికి వెళ్లారు. సాయంత్రం 4.30 గంటల తర్వాత ఆరు సంవత్సరాల రాంబాబు కుమారుడు స్థానిక ప్రైవేట్ పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా అక్క సౌమ్య ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో ఇంటి బయటకు వచ్చి కూర్చున్నాడు. కొద్దిసేపటికే తండ్రి రాంబాబు ఇంటికి రాగానే అక్క ఫ్యాన్‌కు వేలాడుతోందని చెప్పడంతో ఇంట్లోకి వెళ్లిచూడగా సౌమ్యఅప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వీరశేఖర్ సంఘటనా స్థలానికి విచారణ నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళితే తమపైనే అక్రమ కేసులు బనాయించారని, తన భర్త నల్లగొండ డీఈవో భిక్షపతిపై చర్యలు తీసుకోవాలని డీఈవో భిక్షపతి భార్య మాధవి మంగళవారం ఏఎస్పీ రాములునాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని కాపురం చేస్తున్నారని తెలిసి ఆరు రోజుల క్రితం వారు ఉండే ఇంటికి వెళ్లి నిలదీశానని, ఆ విషయంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. భిక్షపతిపై టూటౌన్ ఎస్‌ఐ కేసు నమోదు చేయకుండా తమ పైనే కేసు నమోదు చేశారని తెలిపారు. 2010 ఆగస్టులో తాము హిందూ సాంప్రదాయం ప్రకారం కుటుంబసభ్యులు, పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నామని తెలిపారు. కొద్ది రోజులకే తనను వదిలేశారని, ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నా పట్టించుకోకుండా వేరే మహిళతో ఉంటూ ముగ్గురు పిల్లలను కన్నారని పేర్కొన్నారు. తన భర్త భిక్షపతిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. డీఈవో భిక్షపతిపై బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అవసరమైతే డీజీపీని సైతం కలిసి వివరిస్తానన్నారు. ఎక్కడా న్యాయం జరగకపోతే మహిళా కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

చింతపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మాల్ మార్కెట్ యార్డులోని షాపు నంబర్-8 వద్ద పడిపోయి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని మార్కెట్ కార్యదర్శి వేణుకుమార్ గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి

మోత్కూరు, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం అడ్డగూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన మాదాను ఆరోగ్యం(65) ఓ వీధిలో పడిపోయి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై, మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఎవరైనా అన్నం పెడితే తిని కాలం గడుపుతున్నాడు. మంగళవారం గాయత్రి బ్యాంకు పక్క వీధిలో కిందపడిపోయి మృతిచెందాడు. సమాచారం తెలుసుకుని గ్రామపెద్దలు వచ్చి ఆయన మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

దోరకుంటలో లారీ దగ్ధం

కోదాడ రూరల్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టి దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని దోరకుంట వద్ద మంగళవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ దోరకుంట గ్రామశివారులో బ్రేక్ ఫెయిల్ కావడంతో లారీని డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. మట్టపల్లి నుంచి నాగార్జున సిమెంట్ క్లింకర్ లారీ విజయవాడ దగ్గరలోని ఇబ్రహీంపట్నంలోని కొండపల్లికి వెళ్తున్నండగా దోరకుంట వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆగిఉన్న బియ్యం లారీ పక్కకు కదిలింది. క్లింకర్ లారీలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. లారీ రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కోదాడ నుంచి విజయవాడకు వెళ్తున్న బియ్యం లారీ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీగా అనుమానం వచ్చి వెంటనే రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పరిశీలించారు.

యాదగిరీశుడికి ఘనంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు మంగళవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. పాంచరాత్రాగమ రీతిలో గంట పాటు పూజా పర్వం కొనసాగింది.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమల పాకులు, సిందూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలో స్వయం భూవులను సుప్రభాత సేవలతో మేల్కొల్పి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పంచారాత్రగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు పూజలు, నిత్య రుద్రహవనం కొనసాగాయి.

సత్యేదేవుని వ్రతాల్లో పాల్గొన్న 612 జంటలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కొండకింద వ్రత మండపాల్లో 612 జంటలు సత్యేదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. కొండపైన ఉత్తర తిరువీధి, శివాలయం, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారం వద్ద మహిళ భక్తులు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా తులసి దామోదర కల్యాణం, సత్యదేవుని వ్రతంతో పాటు కార్తీక మాసం చివరి వారంలో వన భోజనాల మాదిరిగానే ఈ ఏడాది కూడా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 29న స్వామివారి స్వాతీ నక్షత్రం రోజు గిరిప్రదక్షిణ ముగిసిన వెంటనే ఉదయం 10.30 గంటలకు మండలంలోని మల్లాపురం గోశాలలో పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కత్తితో దాడి

● భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని కత్తిపోట్లు ● రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త ● స్టేషన్‌లో ఉన్న వ్యక్తిని బయటకు పిలిపించి ఘాతుకం



సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహిస్తున్న ఎస్‌ఐ వీరశేఖర్

తిరుమలగిరి(సాగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆగ్రహిస్తూ ఓ వ్యక్తిపై భర్త పోలీస్‌స్టేషన్ ఆవరణలో కత్తితో దాడి చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ సంఘటన జరిగింది. తిరుమలగిరి(సాగర్) మండలం కీచ్యాతండాకు చెందిన సపావత్ మునినాయక్ ఈ నెల 17వ తేదీన తన ఇంటికి వచ్చి భార్యను వేధింపులకు గురిచేశాడని సపావత్ మోహన్, భార్య సంధ్యతో కలిసి ఈ నెల 19వ తేదీన స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై మునినాయక్‌పై కేసు నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో మోహన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ ఉన్న మునినాయక్‌ను గమనించి కేసు విషయమై మాట్లాడేందుకు బయటకు పిలిపించాడు. పోలీసు వాహనాలు నిలిపే స్థలం వద్దకు రాగా, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా మునిపై కడుపు, వీపు వెనుక భాగం, చేతిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో నిర్ఘాంతపోయిన పోలీసులు, స్థానికులు వెంటనే మోహన్‌ను పట్టుకున్నారు. అప్పటికే తీవ్ర గాయాలతో రక్తస్రావం అవుతుండడంతో మునిని పోలీసు వాహనంలోనే చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్‌ఐలు వీరశేఖర్, వీరబాబు ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

శిథిల భవనం తొలగింపు..



బ్రిటీష్ కాలంలో సూర్యాపేట జిల్లా మునగాలలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ బంగ్లా శిథిలావస్థకు చేరింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ శిథిల భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం కూల్చివేసినట్లు తహసీల్దార్ ఆంజనేయులు, వైద్యాధికారి రవీందర్ తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ప్రభుత్వ వైద్యశాల కొనసాగింది. భవనం శిథిలావస్థకు చేరడంతో దాని వెనుక ఉన్న స్థలంలో నూతన వైద్యశాల నిర్మించారు. ఆ భవనం ప్రారంబించాలని శిథిలావస్థకు చేరిన బంగ్లాను కూల్చినట్లు అధికారులు తెలిపారు. ● మునగాల, (ఆంధ్రజ్యోతి).

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

● నల్లగొండ రెండో ఎస్సీ ఎస్టీ పీఏ యాక్ట్ సెషన్స్ కోర్టు తీర్పు ● ఇద్దరు నిందితులు చర్లపల్లి, మహిళ నిందితురాలు చంచలగూడ జైలుకు తరలింపు

నల్లగొండ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు అడిగినందుకు పథకం ప్రకారం ఇద్దరిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ రెండో ఎస్సీ ఎస్టీ పీఏ యాక్ట్ సెషన్స్ జడ్జి రోజారమణి మంగళవారం తీర్పు ఇచ్చారు. ఏఎస్పీ రాములునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కుమ్మరిగూడెం(చిన్నమాదారం) గ్రామానికి చెందిన మల్లికంటి వెంకటేశ్వర్లు, నల్లగొండ పట్టణానికి చెందిన బొంద రవికుమార్, ఎస్‌కే. గౌస్‌ల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలానికి డబ్బులు ఇచ్చిన వారు అడిగితే వివిధ కారణాలు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో రవికుమార్ అతని స్నేహితుడు గౌస్ కలిసి వెంకటేశ్వర్లును నిలదీశారు. దీంతో వారిపై కక్ష పెంచుకున్న వెంకటేశ్వర్లు రవికుమార్, గౌస్‌లను ఎలాగైనా అంతమొందించాలని పథకం వేశాడు. వెంకటేశ్వర్లు అతని తమ్ముడు మల్లికంటి యాదగిరి, వెంకటేశ్వర్లు భార్య శోభ కలిసి 2014 ఆగస్టు 7వ తేదీన డబ్బులు ఇస్తామని రవికుమార్, గౌస్‌లకు వెంకటేశ్వర్లు సోదరుడు యాదగిరి ఫోన్ చేసి కుమ్మరిగూడేనికి రావాలని పిలిచాడు. అక్కడికి వచ్చిన రవికుమార్, గౌస్‌లను వెంకటేశ్వర్లు, యాదగిరి, శోభ కలిసి విచక్షణారహితంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. యాదగిరి అల్లుడు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కనగల్ పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వర్లు, యాదగిరి, శోభపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టుకు సరైన ఆధారాలను సమర్పించగా మంగళవారం జిల్లా కోర్టులో విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. జీవిత ఖైదు శిక్ష పడిన శోభను చంచలగూడ జైలుకు, వెంకటేశ్వర్లు, యాదగిరిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి విచారణ అధికారులు, ప్రస్తుత ఏఎస్పీ రాములునాయక్, ప్రస్తుత డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, అప్పటి డీఎస్పీ రాంమోహన్‌రావు, సీఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్‌ఐ పరమేష్, ప్రస్తుత సీఐ చండూరు వెంకటయ్య, కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి, ఏపీపీ అఖిలప్రియ, సీడీవో పీసీలు శేఖర్, నగేష్, లైజనింగ్ ఆఫీసర్లు, హెచ్‌సీ పి.నరేందర్, పీసీ ఎస్ మల్లిఖార్జున్‌లను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఓయూ మహిళా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా శృతి



నేరేడుచర్ల, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం మహిళా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి శృతి ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించిన శృతి ప్రస్తుతం ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తమిళనాడులోని కరికుడి అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకు నిర్వహించే సౌత్ జోన్‌లో కబడ్డీ పోటీలకు ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టుకు శృతి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. 60 యూనివర్సిటీలకు చెందిన జట్లు పాల్గొననున్నట్లు శృతి తెలిపింది. శృతి ఎంపికపై నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

ఆత్మకూరు(ఎం) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరెళ్ల గ్రామంలో మారుపాక వీరయ్య మంగళవారం మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన మారుపాక ఉప్పలయ్య(75) వీరయ్య అంత్యక్రియలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఉప్పలయ్యను వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో ఉప్పలయ్య ఒక్కసారిగా కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఉప్ప లయ్య కుటుంబ సభ్యులు అతనిని వెంటనే భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో ఉప్పలయ్య మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉప్పలయ్యను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా



జైనపల్లి, ఫక్కీరుగూడ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

బీబీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భువనగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని జైనపల్లి, ఫక్కీరుగూడ, మాదారం, సిరివేణికుంట, అన్నంపట్ల, బొమ్మాయిపల్లి బీటీరోడ్లతో పాటు చిన్నరావులపల్లి, భట్టుగూడెం, రాయరావుపేట, గుర్రాలదండి, రుద్రవెల్లి గ్రామాల్లో ఉపాధి హామీని నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సాగునీటి కాల్వల విస్తరణ, మూసీ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, డీఈ సుదర్శన్‌రెడ్డి, డీఆర్‌ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, నాయకులు పోట్టోళ్ల శ్యాంగౌడ్, పింగల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఆంజనేయులు గౌడ్, బాల్‌రెడ్డి, అచ్చయ్యగౌడ్, నికిల్ రెడ్డి, ఆగమయ్య గౌడ్, వాసుదేవర రెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో గజగజ

(5వ పేజీ తరువాయి)

వెళ్లదీస్తున్నారు. ఎస్సీ గురుకుల పాఠశాల శిథిలావస్థలకు చేరుకుంది.

● బీబీనగర్‌లోని సంక్షేమ హాస్టళ్లలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో వంట మనిషితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇరుకైన అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయి. స్నానాలకు చన్నీళ్లే దిక్కు. ఎస్సీ బాలుర వసతిగృహంలో 56 మందికి ఏడుగురు మాత్రమే ఉన్నారు. బీసీ బాలికల హాస్టల్‌లో 46మందికి 10మంది మాత్రమే విద్యార్థులున్నారు. హాస్టళ్లలో ఉండేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు.

● ఆలేరులోని గిరిజన వసతిగృహంలో 31మంది విద్యార్థులకు 17మంది ఉన్నారు. ఎస్సీ సంక్షేమ హాస్టల్(బాలికలు) 55 మందికి 45మంది ఉన్నారు. బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో 15మందికి తొమ్మిది మంది విద్యార్థులున్నారు. ఈ హాస్టళ్లలోని విద్యార్థులు చల్లని నీటితో స్నానాలు చేస్తున్నారు. వాటర్ ఫిల్టర్లు పనిచేయడంలేదు. వార్డెన్ స్థానికంగా ఉండటంలేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. ఎస్టీ బాలుర హాస్టల్‌కు ప్రహరీసైతం లేకపోవడంతో అప్పుడప్పుడు విష సర్పాలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

● రాజపేట మండలంలో మూడు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి. మండలకేంద్రంలోని గురకుల పాఠశాలలో 560 మంది విద్యార్థులున్నారు. పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. తలుపులు, కిటికీలకు డోర్లు పూర్తిగాలేవు. డార్మెటరీ విద్యార్థులకు అందుబాటులో లేదు.

● భువనగిరి మండలం అనంతారంలోని బీసీ సంక్షేమ గురుకుల హాస్టల్‌లో 1200 మంది విద్యార్థులకు 919మంది ఉన్నారు. విద్యార్థులకు ఇప్పటివరకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. చన్నీళ్లతోనే స్నానాలు చేయాల్సి వస్తుంది.

● సంస్థాన్‌నారాయణపురం బాలుర, బాలికల వసతి గృహాల్లో దుప్పట్లు ఇటీవల విద్యార్థులకు అందజేశారు. వేడినీళ్లు అందించడంలేదు. ఈ వసతి గృహం చుట్టూ ఒక వైపు పొలం, మరోవైపు పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో అప్పుడప్పుడు పాములు కూడా వస్తున్నాయి. హాస్టల్ బస చేసేందుకు కలెక్టర్ వస్తుండటంతో పరిసర ప్రాంతాలు శుభ్రంచేసి ఉంచారు.

● వలిగొండ మండలం లోతుకుంటలోని కేజీబీవీలో కోతుల బెడద ఉంది. ఈసంవత్సరం విద్యార్థులకు బెడ్‌షీట్లు అందివ్వలేదు. పలు గదులకు తలుపులు, కిటికీలు లేకపోవంతో ఇబ్బందులుపడుతున్నారు. పాములు కూడా హాస్టళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆత్మకూరు(ఎం)లోని బీసీ బాలుర హాస్టల్‌లో ఒక్క విద్యార్థి కూడా లేరు. హాస్టల్ గదులకు తాళాలు కూడా తీయలేదు. వంట చేసిన పాత్రలన్నీ కూడా కడగకుండా పడేశారు. ఉదయం వరకు హాస్టల్ వార్డెన్, సిబ్బంది రాలేదు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో వార్డెన్ రావడంలేదు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్ కోరారు. పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ మునిసిపల్ సమావేశంలో వారు మాట్లాడారు. నివాస గృహాలకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని వారు కోరారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ చిల్కూరి ప్రభాకర్ రెడ్డి, నాయకులు పబ్బు రాజు, మొగుదాల రమేష్‌గౌడ్, టి.రవీందర్, బొంగు జంగయ్య, బి.మురళి, ఉబ్బు వెంకటయ్య, బండమీది మల్లేశం, బొడిగె బాలకృష్ణ, దేవరాజు, జానీ, ఎండీ బాబా షరీఫ్ కె.లింగస్వామి, కె.సైదులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయం ఆవరణలో సీసీ పనులను మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోశిక నర్సింహ, గోశిక రవి, గోశిక వినయ్ కుమార్, భావనారుషి పాల్గొన్నారు.

చెట్లను తొలగించడం దారుణం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామం నుంచి పంతంగి గ్రామ స్టేజీ వరకు 65వ నంబరు జాతీయ రహదారి వెంట విద్యుత్ తీగల మరమ్మతు పేరిట చెట్లను తొలగించడం దారుణమని బీజేపీ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జి దూడల భిక్షంగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అటవీ శాఖ రేంజర్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ తీగలకు తగిలే కొమ్మలకు బదులుగా మొత్తం చెట్లనే తొలగించారనివిచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పీపల్‌పహాడ్‌లో వైద్య శిబిరం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీపల్‌పహాడ్ పంచాయతీ పరిధిలో యానగుడి తండాలో దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జయంత్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లింగారెడ్డి, కళాసాగర్ రెడ్డి, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

భువనగిరి గంజ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఎన్నికల్లో రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్రం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. మంగళవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.రజక వృత్తిదారులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాతరాజు దశరథ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాటూరి బాల్‌రాజు, వడ్డబోయిన వెంకటేష్, బాలరాజు, స్వామి, మైసయ్య, న గేష్, శ్రీనివాస్, రవి, సతీష్, కృష్ణ తదితరుల పాల్గొన్నారు.

సాగు నీటి వనరుల పూర్తికి ఉద్యమాలు : సీపీఎం



చౌటుప్పల్ లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

చౌటుప్పల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీరు అందించేందుకు రూపొందించిన చిన్ననీటి వనరుల పూర్తి కోసం ప్రజా ఉద్యమాలను నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్ తెలిపారు. స్థానిక కందాళ రంగారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్వాపూర్, గంధమళ్ల, శివన్నగూడెం రిజర్వాయర్ల పూర్తి చేయించేందుకు ప్రజా ఉద్యమాలను చేపట్టేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రంలో ఇంజినీరింగ్, పీజీ కళాశాలలతో పాటు చౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు గోశిక కరుణాకర్, జి.సైదులు, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, బండారు నర్సింహా, ఎండీ పాషా, అరుణ్‌కుమార్, పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు చెల్లించాలి

మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు జీవనభృతి కింద రూ.12 వేలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు భరించలేక కూలీలు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ



ర్యాలీలో పాల్గొన్న సంఘం నాయకులు

భువనగిరి గంజ్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకటయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సాయి బాబా ఆలయం నుంచి బాబు జగ్జీవన్ చౌరస్తా వరకు జాయింట్ ప్లాట్‌పామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరి రాజయ్య, ఏశాల అశోక్, జక్క దయాకర్‌రెడ్డి, కొమరయ్య, ముత్యాలు, రాములు, ఇమ్రాన్, లక్ష్మయ్య, పాండు, మల్లేషం, బాలరాజు, నరసింహులు, చంద్రారెడ్డి, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

నాస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో డిసెంబర్ 4న జిల్లాలో నిర్వహిస్తున్న నాస్- 2024 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. నాస్ పరీక్షపై మంగళవారం భువనగిరిలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా మంత్రిత్వశాఖ, ఎన్‌సీఈఆర్‌టీసీబీఎస్ సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాస్టర్ ట్రైనర్స్ షేక్ జానీ అఫ్గాన్, నర్సింహచారి, నాస్ పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి పాండునాయక్, కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోర్డుపై స్టాక్ వివరాలు రాయాలి

ఆలేరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దుకాణాల్లో ప్రతిరోజు ఎరువుల వివరాలను స్టాక్ బోర్డులపై రాయాలని ఏ డీఏ పద్మావతి సూచించారు. మండలంలోని కొలనుపాకల ఎరువుల, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. వికార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు శాలిని నాగార్జున, శివకుమార్, షాకీరా, స్నేహ ఉన్నారు.

ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలి

బీబీనగర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యమ కారుల ఫోరం మండలాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళ వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధ, గురువారం కరీంనగర్ నుంచి వేములవాడ వరకు ఉద్యమకారులు నిర్వహించతలపెట్టిన మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్య క్రమంలో ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి ధరావత్ చంద్రబాను నాయక్, జిల్లా అధికార ప్రతినిధి సోమారం శంకర్, జంగయ్య, నర్సింగ రావు, సత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: టీఎస్ యూటీఎఫ్





వెంకన్న, సత్తయ్య

మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల దామోదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంఘం ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా దర్శనం వెంకన్న, ఉపాధ్యక్షుడిగా దడిపల్లి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా అన్నారం సత్తయ్య, కోశాధికారిగా మాతంగి అశోక్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా తొర్ర ఉప్పలయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వెంకటాచారి, గుండా మల్లేశం, లింగమల్లు, ధరావత్ తిరుపతి, వెంకటేశ్వర్లు, ఉమేష్‌చంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

మోటకొండూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎంఈవో కేతిరెడ్డి రఘురాంరెడ్డి అన్నారు. శశిధర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంది చంద్రకళ, రాంరెడ్డి కుమారుడు శశిధర్ రెడ్డి 7వ వర్థంతి సందర్భంగా మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సదుపాయాలకల్పనకు రూ.10 వేలు అందజేశారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ, బహుమతులు అందజేస్తామని శశిధర్‌రెడ్డి, చేయూత ఫౌండేషన్ చైర్మన్లు తెలిపారు. చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు షురూ

వలిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిశాల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి ఆగమశాస్త్ర రీతిలో విశ్వక్సేనుడికి తొలి పూజతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పట్టువస్త్రాలు, బంగారు ముత్యాల ఆభరణాలతో అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు సంతోష్‌కుమాచార్యులు, అర్చకులు, వేంకటేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'30 మంది విద్యార్థినులకు నలుగురే ఉన్నారు'

మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు సుందరయ్య కాలనీలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను మంగళవారం మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ సందర్శించగా 30 మంది విద్యార్థినులకు నలుగురు విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. ఆయన వెళ్లేప్పటికి మాట్రిన్ కూడా హాస్టల్‌లో లేరు. అక్కడ ఉన్న వర్కర్‌ను అడిగితే మాట్రిన్ వేరే హాస్టల్‌కు ఇన్‌చార్జిగా ఉండటంతో అక్కడకు వెళ్లారని చెప్పింది. పిల్లలు నలుగురే ఉన్నారేమిటని అడగ్గా లోకల్ వారు ఎక్కువగా ఉన్నారని, వారు టిఫిన్ చేసి వెళ్లారని తెలిపింది. మరుగుదొడ్లు, స్నానాల గదులు పరిశీలించి శుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లలో అధికారులు మంగళవారం రాత్రి చేయాల్సి రాత్రి నిద్ర వాయిదా పడినట్టు తెలిసింది.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా చూడాలి

● రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష



రామన్నపేట : ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి ,న్యాయవాదులు

రామన్నపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రామన్న పేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి శిరీష అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కోర్టు ఆవరణలో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలోచన, వ్యక్తిత్వం, నమ్మకం, విశ్వాసం, హోదా, సోదరభావం, వ్యక్తిగౌరవం, మన దేశం ఐక్యత సమగ్రతకు భరోసా ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో న్యాయవాదులు ఉయ్యాల హనుమంతు గౌడ్, మామిడి వెంకట్‌రెడ్డి, బాసరాజు అశోక్‌కుమార్, యాదాసు యాదయ్య, స్వామి, సూపరింటెండెంట్ శివరాజు, మధులిక సిబ్బంది పాల్గొన్నారు.


● మోత్కూరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి తుంగ తుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనం నేరమని రాజ్యాంగంలో పొందుపర్చడంతోనే రూపుమాసిపోయిందన్నారు.

● యాదగిరిగుట్ట రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి): గుట్ట వృత్తి నైపుణ్య శిక్షణకేంద్రంలో నవభారత్ యూత్ అసోసియేషన్, నెహ్రూ యువకేంద్రం సంయుక్తంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు శిక్షకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు పాల్గొన్నారు.

● బీబీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : బీబీనగర్ శివారులోని సాంఘీక సంక్షేమ గురుకుల సైనిక మహిళ డిగ్రీ కళాశాలలో నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ నిరూపతో పాటు అధ్యాపక బృందం నివాళులర్పించారు.

● భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపర్యవేక్షణ కమిటీ, పూలే అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళర్పించారు. కార్యక్రమంలో జిమునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తి , పీసీసీ కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ చైతన్య రథయాత్రకు ఘన స్వాగతం



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఎర్రవరం లక్ష్మీనర్సింహా స్వామి ఆలయం నుంచి నిర్వ హిస్తున్న హిందూ చైతన్య రథయాత్ర మంగళవారం సాయంత్రం మోత్కూరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రథయాత్ర జిల్లా ప్రముఖ్ దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రజలకు హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించేందుకే ఈ రథయాత్ర చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం.సోమయ్య, బీజేపీ పట్టణాధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, కె.మహేందర్, ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పాటిమట్లలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేలు


మోత్కూరు, అడ్డగూడూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మోత్కూరు మండలం పాటిమట్ల, అడ్డగూడూరు మండలం డి. రాపాక గ్రామంలో ఉపాధి హామీ నిధుల నుంచి రూ, 20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనాలు, పాటిమట్లతో బోర్ వెల్ రిచార్జ్ స్ట్రక్చర్ (ఇంకు డుగుంత)కు రాపాకలో సీసీ రోడ్డు పను లకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామీణ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మోత్కూరు కార్యక్రమాల్లో మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్ విండోచైర్మన్ పేల పూడి వెంకటేశ్వర్లు, అదనపు డీఆర్‌డీవో సురేష్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, కౌన్సిలర్ పురుగుల వెంకన్న, గనగాని నర్సయ్య, అవిశెట్టి అవిలిమల్లు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సమీర్, బద్దం నాగార్జునరెడ్డి, పేలపూడి సత్యనారాయణ బుంగపట్ల యాకయ్య పాల్గొన్నారు. అడ్డగూడూరు మండలం డి. రాపాక కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య, మోత్కూరు మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, నాయకులు ఇటీకాల చిరంజీవి, వళ్లంభట్ల రవీందర్, బొమ్మగాని లక్ష్మయ్య, విద్యాసాగర్, సోమయ్య తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా నిరీక్షణే

(5వ పేజీ తరువాయి)

భువనగిరి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులను సంప్రదించగా ఎకరాకు రూ.26,87,012 చొప్పున, వ్యవసాయేతర భూములకు గజానికి రూ.1687 చొప్పున, డీటీసీపీ ప్లాట్లకు గతంలో గజానికి రూ.1296 కేటాయించగా ప్రస్తుతం రూ.2800 చొప్పున చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారని తండావాసులు వివరించారు. భూపరిహారంకోసం నిర్వాసితులు అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, కోడ్ ముగిసిన తర్వాత డబ్బులు ఇస్తామని అధికారులు చెప్పి 2023 అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత తమకు మాత్రం డబ్బులు ఇవ్వలేదని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐదేళ్లుగా తమ గ్రామాలు, భూములు ముంపునకు గురవుతున్నాయని అధికారులు చెప్పడంతో క్రయ విక్రయాలు లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలంటే తమ వద్ద డబ్బులు లేవని, తమ భూములు ఎవరికైనా విక్రయించాలన్నారు ఎవరు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని, అప్పులు కూడా పుట్టడంలేదని ఆందోళన చెందు తున్నారు. తండాలో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐదుగురు మృతి చెందినట్లు తండావాసులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం రూ.50కోట్లు విడుదల చేసినట్లు మీడియా ద్వారా తెలిసిందని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఆ డబ్బులు తమకు కేటాయించాలని కోరుతూ చోక్లతండా, కొక్యాతండా, పీర్యాతండా భూ నిర్వాసితులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమారెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, కలెక్టర్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.


వెంటనే పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలి



గత ప్రభుత్వంలో ఇప్పటి వరకు బీఎన్ తిమ్మాపూర్, లప్పానాయక్‌తండాలకే భూపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించారు. ఇళ్ల స్థలా లు కూడా వారికే కేటాయించారు. ఇప్పటివరకు చోక్లతండ, కొక్యాతండా, పీర్యాతండా భూ నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా కల్పించలేదు. విప్ బీర్ల అయిలయ్య వెంటనే స్పందించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రూ.50కోట్లను మాకు కేటాయించాలి.

- రామోజీనాయక్, చోక్లతండా

పిల్లల పెళ్లిళ్లు చేయలేకపోతున్నాం



ప్రాజెక్టు నిర్మాణంలో మా భూములు కోల్పోయాం. గత కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలకు పెళ్లిళ్లు చేయాలేకపోతున్నాం. గత ప్రభుత్వం మాకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత ప్రభుత్వమైనా, మా సమస్యలను గుర్తించి నష్ట పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి.

-సఫావట్ నరేశ్, కొక్యాతండా

సంక్షిప్తంగా

● భువనగిరి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిసెంబరు 1 నుంచి వరకు జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా యాత్ర ప్రముఖ్ దాసరి మల్లేశం తెలిపారు. భువనగిరిలో మంగళవారం నిర్వహించిన ర్యాలీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజుల కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలని ఇందుకు నాయకులు, కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు.సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాశం బాస్కర్, చందా మహేందర్‌గుప్తా, మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, మాధురి, పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు ఏలు భిక్షపతి ఆధ్వర్యంలో ఆమెను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, గంజి కృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నర్సింహ, చిలువేరు లక్ష్మయ్య, బైకానీ అబ్బయ్య, కలుకూరి చంద్రమ్మ, పొట్ట మౌనిక ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను భీమనపల్లి సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5వేలుచొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, గౌరవాధ్యక్షులు అనిరెడ్డి జగన్‌రెడ్డి, కొత్త పర్వతరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు మంచాల మధు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు నెలలు గడుస్తున్నా బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు ఇ అంజమ్మ, సాలమ్మ, లక్ష్మీ, కవిత, లలిత, జయమ్మ, వెంకటమ్మ, యాదమ్మ, రమాదేవి, వసంత, తదితరులు పాల్గొన్నారు.